# ప్రేమ, కృప, కనికరము, మరియు బాప్తిస్మము

> ''ఏలయనగా మనమింక బలహీనులమై యుండగా, క్రీస్తు యుక్తకాలమున భక్తిహీనుల కొరకు చనిపోయెను. నీతిమంతునికొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు; మంచివానికొరకు ఎవడైన ఒకవేళ చనిపోవ తెగింపవచ్చును. అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను'' (రోమా 5:6-8).

దేవుని ప్రేమ, కృప మరియు కనికరము లేకుంటే మనమందరము నిత్య నాశనానికి లోనై ఉండేవారం. మనం చేయగలిగిందేదియు మన రక్షణను సంపాదించలేదు లేక మన పాపక్షమాపణను పుట్టించలేదు. దేవుని యొక్క స్వభావమును, ఆయన కార్యములును మనకు రక్షణను ప్రసాదించాయి.

## దేవుని ప్రేమ

దేవుని గూర్చిన వర్ణన ''దేవుడు ప్రేమయైయున్నాడు'' అని వ్యక్తపరచడంలో కనుగొంటాం (1యోహాను 4:8బి). మన పాపములకొరకు బలియగునట్లు యేసును యివ్వడానికి దేవునిలోని ప్రేమయే ఆ ఉద్దేశాన్ని కలిగించింది. మనం ఎవరము లేక ఏమైయున్నాము అనేదాన్నిబట్టి గాని, లేక మన సత్క్రియలను బట్టిగాని కాక, దేవుడు ఎవరైయున్నాడు అనేదాన్ని బట్టి మనం రక్షింపబడ్డాం. మనము పాపులమైయుండగా, క్షమాపణకు యోగ్యత లేనివారమును, శిక్షకు పాత్రులమునై ఉండగా, దేవుడు మనపట్ల తన కార్యాన్ని జరిగించాడు:

> అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను (రోమా 5:8).
>
> దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా ... అనుగ్రహించెను (యోహాను 3:16ఎ).
>
> మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమయున్నది (1యోహాను 4:10).

ఆయన ప్రేమకు మనము పాత్రులము కానప్పటికిని, అతని ప్రేమ కార్యముల యొక్క

మేలులను పొందడానికిగాను మనము దేవునికి లోబడాలి. మనకు సేవ చేయడంలో క్రియ జరిగించునట్లు ప్రేమ దేవునికి ఉద్దేశం కలిగించింది. దేవుని పట్ల మన ప్రేమ ఆయనకు లోబడునట్లు క్రియ జరిగించడానికి మనకు బుద్ధి పుట్టించాలి (యోహాను 14:15, 21, 23). నీతి మంతులయ్యేవారి ప్రయోజనం కొరకు ఆయన పని జరిగిస్తాడు కాని కీడు చేయువారి మొరకు ఆయన చెవియొగ్గడు: ''**ప్రభువు** కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవిగాని **ప్రభువు** ముఖము కీడు చేయువారికి విరోధముగా ఉన్నది'' (1 పేతురు 3:12). ఇది సత్యం ఎందుకంటే దేవుడు దుష్టత్వాన్ని అభినందించడు. తన కుమారుని గూర్చి ఆయన యిలా అన్నాడు: ''నీవు నీతిని ప్రేమించితివి దుర్నీతిని ద్వేషించితివి'' (హెబ్రీ. 1:9ఎ). ''పాపము చేయువారంద'' రిని ఆయన ద్వేషించును (కీర్తన. 5:5బి).

ప్రభువైన యేసునందు నమ్మికయుంచి దేవుని ప్రేమకు ప్రత్యుత్తరమియ్యని దుష్టుడు ఆయన ఉగ్రత క్రింద నిలిచియుంటాడు. యోహాను 3:36 యిలా అంటుంది, ''కుమారునియందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడుగాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచి యుండును.'' రోమా 2:5లో పౌలు యిలా హెచ్చరించాడు: ''నీ కాఠిన్యమును మార్పు పొందని నీ హృదయమును అనుసరించి, ఉగ్రత దినమందు, అనగా దేవుని న్యాయమైన తీర్పు బయలుపరచబడు దినమందు నీకు నీవే ఉగ్రతను సమకూర్చుకొనుచున్నావు.'' (రోమా 1:18; ఎఫెసీ. 5:6; ప్రకటన 14:9, 10లను కూడా చూడు.)

దేవుని ప్రేమ మరియు ఉగ్రత అనేవి ఒకదానికొకటి విరోధమైనవి కావు. ఆయన ఉగ్రత ఆయన ప్రేమ యొక్క ఫలితమే. కొన్ని పరిస్థితుల్లో మనమెలా ప్రత్యుత్తరమిస్తామో దానిచేతనే ఈ విషయం ఉదహరింపవచ్చు. తన భర్తను గాఢంగా ప్రేమించే స్త్రీ, అతడు మరొక స్త్రీని వాంఛించితే చాలా కలత చెందుతుంది. ఆమెకు తన భర్త మీద ప్రేమ లేకున్నట్లయితే, అతడు ఎందరు స్త్రీలను వాంఛించినా – అతని యెడల ఆమెకు కోపం వచ్చేది కాదు. దేవుని రోషమునకు, ఉగ్రతకు ఆయన ప్రేమయే ఆధారమైయుండవచ్చు (నిర్గమ. 20:5; ద్వితీయో. 4:24).

దేవుని ప్రేమయందు నిలిచియుండడం ఎలాగో ప్రభువైన యేసు ప్రదర్శించి మనకు తెలిపాడు: ''తండ్రి నన్ను ఏలాగు ప్రేమించెనో నేనును మిమ్మును ఆలాగు ప్రేమించితిని; నా ప్రేమయందు నిలిచియుండుడి. నేను నా తండ్రి ఆజ్ఞలు గైకొని ఆయన ప్రేమయందు నిలిచియున్న ప్రకారము మీరును నా ఆజ్ఞలు గైకొనినయెడల నా ప్రేమయందు నిలిచియుందురు'' (యోహాను 15:9, 10).

దేవుని ప్రేమ షరత్తులతో కూడింది. ఆయన మనలను రక్షించక ముందు అవసరతగా దేవునిచే పెట్టబడిన విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలు, మరియు బాప్తిస్మము అనేవాటిని మనం నెరవేర్చవలసి యుంటుంది. ఆయన ప్రేమకు తగినవారమని కాదుగాని, ఆయన ప్రేమ యొక్క మేలులను పొందడానికి ఈ అవసరమైనవాటిని మనం నెరవేర్చవలసినవారమై ఉన్నాం. మన కార్యములలో ఏదియు దేవుని ప్రేమను సంపాదించలేదు. ఏదియెలాగున్నా, ఆయన మనకు ప్రతిఫలమివ్వకముందు, అవసరముగా కోరబడినవాటిని మనం జరిగించాలి, వాటికి మనం లోబరచుకోవాలి. ''మరియు ఆయన సంపూర్ణసిద్ధి పొందినవాడై, ... తనకు విధేయులైన వారికందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను'' (హెబ్రీ. 5:9, 10).

# దేవుని కృప

*Charis* అనే గ్రీకు పదం (హెబ్రీ.: *hen*), ''కృప'' అని తరచుగా తర్జుమా చేయబడుతూ క్రొత్త నిబంధనలో 155 సార్లు కన్పిస్తుంది. *"Charm"* మరియు దానికి సమానమైన పదాలు ఈ మాటనుండే వస్తాయి. దేవుని ఈ స్వభావ లక్షణం మీద మన రక్షణ ఆధారపడియుంటుంది. *The New International Dictionary of the Bible* ''కృప''కు ఈ నిర్వచనమిస్తుంది:

> (1) సరిగా మాట్లాడితే, సంతోషము, సుఖము, ఆనందము, ఆకర్షణ, యింపు, రమ్యతనిచ్చేది; (2) మంచితనం, దయాళుత్వము, కనికరము, మొదలైనవి; (3) బానిస యెడల తన యజమాని కనుపరచు దయ. ఈలాగున సాదృశ్య రూపంగా, కృప మానవుల యెడల దేవుని దయను సూచించ వచ్చింది (లూకా 1:30). (క్రొత్త నిబంధన) లేఖకులు ఆయా పత్రికల చివరలో, తమ పాఠకులకు దేవుని కృపగల అనుగ్రహాన్ని దీవెనగా పలుకుతారు (రోమా 16:20; ఫిలిప్పీ. 4:23; కొలస్సీ. [1:2]; 1 థెస్స. 5:28). దీనికి తోడు, యోగ్యత లేనివానికి చూపబడిన దయ అనే భావనను వ్యక్తపరచడానికి ''కృప'' అనే పదం ఉపయోగింపబడింది; గనుక తగనివారికి ఉపకారం, ప్రత్యేకించి పాపులపై యేసు క్రీస్తుద్వారా ప్రసాదింపబడిన ఉపకారము యొక్క ప్రమాణం లేక రక్తాన్ని అది సూచిస్తుంది (ఎఫెసీ. 2:4-5). గనుక, కృప అనేది పతనమైన మానవుని యెడల వెలలేని దేవుని అనుగ్రహాన్ని క్రీస్తు నిమిత్తం అనుగ్రహించేదై ఉంది. గనుక, కృపాసత్య సంపూర్ణుడును తండ్రివలన అద్వితీయ కుమారుడు (యోహాను 1:14) – మానవ విమోచన కొరకు ఆయన ఏర్పాటు చేశాడు.[1]

కృపయొక్క ప్రాముఖ్యతను మితిమించి చెప్పలేం. పాపమును బట్టి మనం ఋణస్థులమై ఉన్నాము, పాప ఋణాన్ని తీర్చడానికి మన వద్ద ఏమీ లేదు. అప్పు యొక్క మోతాదు ఏ వ్యత్యాసాన్ని కలిగించదు. ఒక వ్యక్తి పదివేల రూపాయలు అచ్చియున్నా, మరొకడు, ఒకే రూపాయి అచ్చియున్నా, తాను అచ్చియున్న దానిని చెల్లించే మార్గం లేనప్పుడు, యిద్దరు అప్పులోనే నిలిచియుంటారు. ప్రభువైన యేసు రక్తము లేకుండ, అందరు పాపులే (రోమా 3:9, 10, 23). వారు మరణానికి పాత్రులైయున్నారు (రోమా 6:23; యాకోబు 1:15) మరియు మన పాపాల ఋణం చెల్లించడానికి మనకు సొంతమైనది ఏదీ లేదు.

ఒక రూపాయి అప్పు ఉన్నవాడైనా, పదివేల రూపాయల అప్పు ఉన్నవాడైనా – యిద్దరు అప్పునుండి బయటపడ్డారు. అలాగే ఒక్క పాపం క్షమింపబడినవారు, లేక అనేక పాపాలు క్షమింపబడినవారు కూడా సమానంగా క్షమింపబడినవారై వారి పాపములనుండి విడుదల పొందారు. పాపాత్మురాలనబడిన స్త్రీ వచ్చి ఆయన పాదములకు అత్తరు పూసిన సందర్భంలో పరిసయ్యుని విమర్శకు ప్రభువు యిలా జవాబిచ్చాడు: ''... ఆమె విస్తారముగా ప్రేమించెను గనుక ఆమె యొక్క విస్తార పాపములు క్షమించబడెనని నీతో చెప్పుచున్నాను. ఎవనికి కొంచెముగా క్షమింపబడునో, వాడు కొంచెముగా ప్రేమించును ...'' (లూకా 7:47). దేవుని కృపయొక్క సౌందర్యమిది.

ప్రభువైన యేసు, కృపయొక్క సంపూర్ణుడుగా (యోహాను 1:14), మనకు కృపను ప్రసాదించాడు (యోహాను 1:16). మానవుని క్రియలన్నియు ఒక్క పాపపు మరకను సైతం

తొలిగించలేవు (ఎఫెసీ. 2:8). మోషే ధర్మశాస్త్రం కూడా పాపాన్ని తీసివేయ నేరదు (యోహాను 1:17), ఎందుకంటె అది కృపను ప్రసాదించలేదు (గలతీ. 5:4). పౌలు యిలా వ్రాశాడు, ''నేను దేవుని కృపను నిరర్థకము చేయను; నీతి ధర్మశాస్త్రమువలననైతే ఆ పక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ప్రయోజనమే'' (గలతీ. 2:21).

''... క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడు చున్నందున'' మన నీతి, రక్షణలనేవి కృపవలన అనుగ్రహింపబడేవే (రోమా 3:24 చూడు),

> మీరు కృపకే గాని ధర్మశాస్త్రమునకు లోనైనవారు కారు గనుక పాపము మీ మీద ప్రభుత్వము చేయదు (రోమా 6:14).

> అది కృపచేతనైన యెడల ఇకను క్రియల మూలమైనది కాదు; కానియెడల కృప ఇకను కృప కాకపోవును (రోమా 11:6).

> మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు; ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియలవలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు (ఎఫెసీ. 2:8, 9).

దేవుని క్రియవలన రక్షణ ప్రసాదింపబడిందే గాని మన క్రియలవలన అది అనుగ్రహింపబడలేదు.

దేవుని కృప, అపాత్రులకు చేయు ఉపకారం, ప్రతివానికి లభ్యమౌతుండగా (తీతు 2:11), అందరు కృప పొందేది లేదు. ఎందుకంటె కృప క్రీస్తు ద్వారా వచ్చింది (యోహాను 1:17; రోమా 5:15), ఆయనను అంగీకరించనివారు (యోహాను 1:11; 12:48) దేవుని కృపను తృణీకరించినవారైయుంటారు. దేవుని కృపనుబట్టి, తన రక్తమువలన ప్రభువైన యేసు మన రక్షణ కొరకైన క్రయధనాన్ని చెల్లించాడు (అపొ. 20:28; హెబ్రీ. 9:14; 10:19, 20; 1 పేతురు 1:17–19).

రోమా 6లో పౌలు యిలా అడుగుతున్నాడు, ''కృప విస్తరింపవలెనని పాపమందు నిలిచియుందుమా?''; ''పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట ఏలాగు దానిలో జీవించుదుము?'' (1, 2 వచనాలు). మనము కృపలో ప్రవేశించినప్పుడు, మనం పాపము విషయమై చనిపోయి అలవాటు చొప్పున పాపం చేయడం మానాలని ఈ ప్రశ్నలలో గుప్తమైయుంది. ఇది ఏ సమయంలో జరగాలో సూచించడానికి పౌలు మరొక ప్రశ్నను అడుగుతున్నాడు: ''క్రీస్తుయేసు లోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?'' (3 వ.) తరువాత అతడు యిలా వ్రాశాడు: ''కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి'' (4 వ.).

మనము బాప్తిస్మము పొందినప్పుడు కృపలోనికి ప్రవేశించామని పౌలు ఉపదేశాన్ని బట్టి మనం తీర్మానానికి వస్తున్నాం. మనము క్రీస్తులోనికి బాప్తిస్మం పొందినప్పుడు (రోమా 6:3), క్రీస్తు యేసునందున్న దేవుని కృపను, ఎఫెసీ. 1:7 మరియు 2 తిమోతి 2:1లో కన్పిస్తున్నట్లు, పొందుతాం.

ఆయన కృపలోనికి ప్రవేశించడానికి గాను ఈ లేఖన భాగాలు బాప్తిస్మముతో సంబంధం కలిగి ఉంటాయి. బాప్తిస్మము పొందనివారు క్రీస్తునకు వెలుపటనున్నవారై, క్రీస్తునుండి వేరుచేయబడినవారై (ఎఫెసీ. 2:12, 13), క్రీస్తుయేసునందున్న కృపలేనివారైయుంటారు (గలతీ. 5:4). బాప్తిస్మమందు కృపలోనికి బాప్తిస్మం జరుగలేదు, కాని బాప్తిస్మం పొందినప్పుడు ఒకని విశ్వాసమునుబట్టి ఈ ప్రవేశం జరిగింది. పాపపు జీవితాలను జీవించడంలో కొనసాగుతూ ఆయన కృపమీద మనం ఏమియు విధింపకూడదు. ఒకసారి పరిశుద్ధపరచబడిన తరువాత ''బుద్ధిపూర్వకముగా పాపం చేసేవారు కృపకు మూలమగు ఆత్మను'' అవమానపరుస్తారు. హెబ్రీ. 10:26–29 యిలా అంటుంది,

> మనము సత్యమునుగూర్చి అనుభవజ్ఞానము పొందిన తరువాత బుద్ధిపూర్వకముగా పాపము చేసినయెడల పాపములకు బలి యికను ఉండదు గాని న్యాయపు తీర్పునకు భయముతో ఎదురుచూచుటయు, విరోధులను దహింపబోవు తీక్షణమైన అగ్నియు నికను ఉండును. ఎవడైనను మోషే ధర్మశాస్త్రమును నిరాకరించినయెడల ఇద్దరు ముగ్గురు సాక్షుల మాటమీద, కనికరింపకుండ వాని చంపించుదురు. ఇట్లుండగా దేవుని కుమారుని, పాదములతో త్రొక్కి, తాను పరిశుద్ధపరచబడుటకు సాధనమైన నిబంధన రక్తమును అపవిత్రమైనదిగా ఎంచి, కృపకు మూలమగు **ఆత్మ**ను తిరస్కరించినవాడు ఎంత ఎక్కువైన దండనకు పాత్రుడుగా ఎంచబడునని మీకు తోచును?

## దేవుని కనికరము

''కనికరము'' (Gk.: క్రియావాచకం – *eleeo*; నామవాచకం – *eleos*) అంటే, ''శత్రువు మీద లేక చట్టం మీరిన వానిమీద విధించే శిక్షనుండి ఓర్పుతో [తొలిగి యుండుట]; బలహీనుడైన వానికి, రోగికి లేక పేదవానికి సహాయము చేయుటకు కలుగు దయ.''[2] అప్పు తిరిగి చెల్లింపబడాలని వెదకకుండుట కూడ యిందులో చేర్చబడింది (మత్తయి 18:33). కృపలో కనికరము ఉన్నా, కృప కనికరమును మించినదై ఉంటుంది. కృప, కనికరములనే రెండును తప్పును శిక్షింపక మానుకుంటాయి. ఏదియెలాగున్నా, కృప యింకా ముందుకు సాగి, తప్పు చేసినవానికి సహాయాన్ని యిస్తుంది.

ఇల్లు లేనివాడు బుద్ధిపూర్వకంగా ఒక యింటిని పాడు చేసినట్టయితే, ఆ వ్యక్తిని యింటి యజమాని న్యాయ సమ్మతంగా శిక్షించవచ్చు మరియు / లేక నష్టపరిహారాన్ని చెల్లింప నిర్బంధింప వచ్చు. తనకు కీడు చేసినవానిని శిక్షింపకయు, నష్టపరిహారాన్ని కోరకయు ఆ యింటి యజమానుడు ఆగినయెడల, ఆతడు కనికరము చూపువాడై ఉంటాడు. ఇంటిని పాడు చేసినవానిని క్షమించి యజమానుడు అతనికి నివసింప స్థలము యిచ్చిన యెడల అది కృపాకార్యమై ఉంటుంది.

తన చిత్తానికి విధేయులైనవారికి, క్షమాపణను, శిక్షనుండి విడుదలను దేవుడు కనికరముతో ఏర్పాటు చేశాడు. ఆయన కృపనుబట్టి, పరలోకమందు నిత్యజీవాన్ని ప్రసాదించడానికి ఆయన ఏర్పాటు చేశాడు. పాపిని శిక్షింపకుండ దేవుని కనికరము కాపాడుతుంది, అపాత్రునికి ఆశీర్వాదములు ప్రసాదించేలా ఆయన కృప ఉంటుంది.

''అందరియెడల కరుణ చూపవలెనని, దేవుడు అందరిని అవిధేయతా స్థితిలో మూసివేసి

బంధించియున్నాడు'' (రోమా 11:32; NIV). గత కాలంలో అవిధేయులైయుండి, యిప్పుడు విధేయులైన పాపులను క్షమించుటలో కనికరము పని కలిగి యుంటుంది. ప్రధాన పాపియై ఉన్నట్లు తన్ను తాను చెప్పుకొన్న పౌలు కనికరించబడినట్లు తెలిపాడు (1 తిమోతి 1:15, 16). దమస్కు పట్టణంలో పౌలుకు దేవుని క్షమాపణ, కనికరము అనేవి కనుపరచబడ్డాయి. అననీయ సౌలుతో, ''గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుమని చెప్పెను'' (అపొ. 22:16). పౌలు బాప్తిస్మము పొందినప్పుడు, అతడు దేవుని కనికరమును సంపాదించుకొనలేదు; అయితే దేవుని కృపాకనికరములవలన ఏర్పాటు చేయబడిన క్షమాపణలోనికి అతడు ప్రవేశించాడు.

## సంగ్రహం

మనము పాపులమైయున్నప్పటికి, దేవుని ప్రేమ, కృప, కనికరములనేవి మనకు సహాయము చేయునట్లు ఆయనకు మనస్సు కలిగించాయి. అలాటి దీవెనలకు పాత్రులమై ఉండడానికి మనం చేయగలిగేదేదీ లేదు. అయినా, వాటిని పొందడానికి మాత్రం మనం దేవునికి లోబడి ఉండాలి. విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మములనేవి దేవుని ఆశీర్వాదములకు పాత్రులము అవ్వడానికి చేయబడే మెచ్చదగిన కార్యాలు కావు. అయితే దేవుడు తన కృప కనికరములను బట్టి వాగ్దానం చేసిన ఆయన ఆశీర్వాదములు యివ్వక ముందు, మనం జరిగించవలసిన అవసరమైన పనులే.

---

సూచనలు

[1]J. D. Douglas and Merrill C. Tenney, eds., ''grace,'' in *The New International Dictionary of the Bible* (Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1987), 401. [2]J. D. Douglas and Merrill C. Tenney, eds., ''mercy,'' in *The New International Dictionary of the Bible* (Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1987), 641.